
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

సోమవారం 27 అక్టోబరు 2025



విమానంలో ప్రయాణికుడి హల్‌చల్

శంషాబాద్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఆదివారం మధ్యాహ్నం గోండియాకు బయలుదేరిన విమానం రన్‌వే వైపు వెళ్తుండగా అందులో ప్రయాణిస్తున్న జోగేంద్రకుమార్ మద్యం మత్తులో ఎయిర్‌లైన్స్ సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. గమనించిన సిబ్బంది పైలెట్‌కు సమాచారం అందించారు. పైలెట్ ఎయిర్‌లైన్స్ అధికారులను సంప్రదించి జోగేంద్రకుమార్‌ను విమానం నుంచి దించారు. అనంతరం విమానం గోండియాకు బయలుదేరి వెళ్లింది. మద్యం మత్తులో ఉన్న జోగేంద్రకుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

త్వరలో 'పట్నం' చెరువు

సుందరీకరణ పనులు

» ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే ఇబ్రహీంపట్నం చెరువు సుందరీకరణ పనులు చేపడుతామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇందుకోసం ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన చెప్పారు. చెరువు సుందరీకరణపై నగరంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. చెరువు కట్టపై పార్కును అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఆయన చెప్పారు. భవిష్యత్ అవసరాలను గుర్తించి సరైన రోడ్ మ్యాప్ రూపొందిస్తున్నామన్నారు. రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సదానందంగౌడ్

సీపీఎస్‌ను రద్దు చేసి పీఆర్సీని ప్రకటించాలి

» ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయడంతోపాటు వెంటనే పీఆర్సీని ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని బొంగులూరులో జరిగిన ఎస్టీయూ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులకు అందాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. వేతన సవరణను అమలు చేయడంతోపాటు ఐదు డీఏలను చెల్లించాలన్నారు. 2018 రాష్ట్రపతి ప్రెసిడెన్షియల్ ఉత్తర్వుల మేరకు ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలన్నారు. లేదంటే డైట్ లెక్చరర్స్, జూనియర్ అధ్యాపకులు, ఎంఈవో వంటి పర్యవేక్షక పోస్టులను భర్తీ చేయడం సాధ్యం కాదన్నారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌తో ప్రభుత్వం వెంటనే ప్రధాన ఉపాధ్యాయ సంఘాల సమావేశాన్ని నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, సత్తు పాండురంగారెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, సుధాకర్, శ్రీనివాస్‌రావు, రాజమణి, వీరమణి, ఏఐఎస్‌టీఎఫ్ నాయకులు పరమేశ్, జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లక్కునోళ్లకే కిక్కు!



నేడు మద్యం దుకాణాలకు లక్కీడ్రా

మద్యం దుకాణాలకు దరఖాస్తు ప్రక్రియ ముగియగా నేడు అదృష్టవంతులు ఎవరనేది తేలనుంది. శంషాబాద్‌లోని మల్లికా కన్వెన్షన్‌లో ఉదయం 11 గంటలకు డ్రా తీసేందుకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ సి.నారాయణరెడ్డి మద్యం దుకాణాల కేటాయింపుకు సంబంధించి డ్రా తీయనున్నారు. జిల్లాలో గెజిట్ నెంబర్ల వారీగా ఒక్కో మద్యం దుకాణానికి వచ్చిన దరఖాస్తుల సంఖ్య మేరకు కాయిన్స్ బాక్సులో వేసి దాంట్లో నుంచి డ్రా ద్వారా ఒక లక్కీ కాయిన్‌ను తీసి దరఖాస్తుదారుడి పేరు ప్రకటించనున్నారు. రెండేళ్ల కాలానికి లైసెన్స్ జారీ చేస్తారు. తమకు అదృష్టం వరిస్తుందో, లేదోనని టెండర్‌దారులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

హాజరుకానున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఆశల పల్లకీలో టెండర్‌దారులు

జిల్లాలో 249 దుకాణాలు..

16,381 దరఖాస్తులు

శంషాబాద్, సరూర్‌నగర్ యూనిట్లకు వేర్వేరుగా హాళ్లు ఏర్పాటు





మద్యం దుకాణాల లక్కీడ్రా కోసం ఓ ఫంక్షన్ హాల్‌లో చేసిన ఏర్పాట్లు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం దుకాణాలకుగాను నేడు (సోమవారం) లాటరీ పద్ధతిన డ్రా తీయనున్నారు. లక్కెవరిదనేది నేడు తేలనుంది. దీంతో దరఖాస్తుదారుల్లో టెన్షన్ పట్టుకుంది. జిల్లాలో మొత్తం 249 మద్యం దుకాణాలకుగాను 16,381 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో శంషాబాద్, సరూర్‌నగర్ రెండు యూనిట్లకుగాను శంషాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్ పరిధిలో 111 మద్యం షాపులకు దరఖాస్తులను ఆహ్వానించగా మొత్తం 8,536 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 7,185 మంది పురుషులు, 1,351 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. అలాగే సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పరిధిలో

మిగతా 8వ పేజీలో...



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



సభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

దోపిడీ ఉన్నంతకాలం కమ్యూనిస్టులుంటారు

» బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న బీజేపీ

» సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

ఇబ్రహీంపట్నం/ఆదిభట్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) పేదరికం, అణిచివేత ఉన్నంతకాలం కమ్యూనిస్టులు ఉంటారని.. పేదరికం, దోపిడీ లేని సమాజాన్ని నిర్మించడమే కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలో పాషా, నరహరిల 36వ వర్ధంతి సందర్భంగా ఆర్టీసీ డిపో నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టులు లేకుండా చేయాలని కలలుకంటున్న పెట్టుబడిదారులు, భూస్వాములు, పాలకవర్గాల ఆటలు సాగవన్నారు. ఎర్రజెండా నాయకత్వంలోనే పేదలు, రైతులు, కూలీలు ఉద్యమించి తన హక్కులు సాధించుకుంటున్నారన్నారు. కమ్యూనిస్టులకు సీట్లు, ఓట్లు ముఖ్యం కాదని, ప్రజా సమస్యలు ఉన్నంతకాలం ఎర్రజెండా ఉంటుందన్నారు. పేద ప్రజల పక్షాన పోరాడుతున్న పాషా, నరహరిలను భౌతికంగా హత్య చేయవచ్చు కానీ.. వారి ఆశయం చంపలేరన్నారు. వారి స్ఫూర్తితోని నేడు ఇబ్రహీంపట్నంలో ఎర్రజెండా ఎగిరిందని గుర్తు చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతుందన్నారు. అసలు దోషి బీజేపీయేనని విమర్శించారు. కేంద్రంలో బీసీ జనగణన చేయాలని అన్ని రాజకీయ పక్షాలు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేసినా, మోడీ ప్రభుత్వం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లు సాధించుకునేందుకు అన్ని రాజకీయ పక్షాలు ఢిల్లీలో కూర్చొని తేల్చుకునేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఫ్యూచర్‌సిటీ పేరుతో రైతులను మోసం చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై సమరశీల పోరాటాలకు కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భాస్కర్, సామేల్, జగదీష్, రాంచందర్, జగన్, జిల్లా కమిటీ సభ్యులు నరసింహ, బుగ్గరాములు, కిషన్, జంగయ్య, జగన్, అంజయ్య, ఎల్లేష్, బాల్‌రాజ్, సుమలత, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

కుట్రపూరితంగానే

నామినేషన్ల తిరస్కరణ

» ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న రైతులు

యాచారం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విధానాలను నగరంలోని జూబ్లీహిల్స్ ఓటర్లకు వివరిస్తామనే భయంతో ఎన్నికల అధికారులు తమ నామినేషన్లను కుట్రపూరితంగా తిరస్కరించారని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు కవుల సరస్వతీ, సందీప్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల ఫార్మాసిటీ బాధిత రైతులు, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు మేడిపల్లిలో సమావేశమయ్యారు. ఆర్డీవో కార్యాలయంలో సర్టిఫైడ్ ఎలక్టోరల్ రోల్స్ కాపీలు ఇవ్వడానికి ఇబ్బందులు సృష్టించారని వారు ఆరోపించారు. రైతుల గురించి స్పెషల్‌బ్రాంచ్ పోలీసుల చేత విచారణ చేయించి భయపెట్టించడానికి ప్రభుత్వం కుట్ర చేసిందని ఆరోపించారు. ఫార్మాసిటీ బాధిత రైతులు ఎన్నికల బరిలో ఉంటే తమ పరువు పోతుందని అధికారుల చేత తామేసిన నామినేషన్లను తిరస్కరించడానికి అనేక కారణాలు చూపారని వారు పేర్కొన్నారు. రాజకీయ పార్టీల అఫిడవిట్‌లో చాలా ఖాళీగా ఉన్నా వారి నామినేషన్లు ఎందుకు ఆమోదించలేదో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ట్రిబుల్‌ఆర్ రైతుల నామినేషన్లను కూడా తిరస్కరించడంపై ఎన్నికల అధికారుల తీరుపై వారు అనుమానాలు వ్యక్తం చేశారు. ఇదే అంశంపై న్యూఢిల్లీలోని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామన్నారు.

మన్‌కీ బాత్ వీక్షించిన బీజేపీ నాయకులు

ఆమనగల్లు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ప్రజలతో పంచుకునే విషయాలకు సంబంధించిన మన్‌కీ బాత్ కార్యక్రమం వీక్షణకు ఆమనగల్లు పట్టణంలో ఆదివారం బీజేపీ నాయకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దేశ ప్రజలతో మమేకం కావాలనే లక్ష్యంతో మోదీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు కార్యకర్తలతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు కండె హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నర్సింహ, ఆమనగల్లు మండలాధ్యక్షుడు ఎర్రవోలు శ్రీను, మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్‌రెడ్డి, నాయకులు చెక్కాల లక్ష్మణ్, చెన్నకేశవులు, విజయ్‌రాథోడ్, శ్రీకాంత్ సింగ్, జెనిగల గిరి, తదితరులు పాల్గొన్నారు.

దండిగా నిధులు.. అభివృద్ధి పరుగులు

దశాబ్దాలుగా అభివృద్ధికి నోచని రహదారులు అద్దంలా మారనున్నాయి. ఏళ్ల క్రితం నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అడ్డంకులు తొలగునున్నాయి. వంద పడకల ఆస్పత్రి కోసం నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ ఆస్పత్రి పనులు ఇక చకచకా సాగనున్నాయి. కేజీబీవీ పాఠశాలలకు కొత్త రూపురేఖలు సంతరించుకోనున్నాయి. అభివృద్ధికి ఆదర్శం 'షాద్‌నగర్ అసెంబ్లీ' అని చూపటానికి ఎమ్మెల్యే కృషితో రాష్ట్ర సర్కారు నెల వ్యవధిలోనే ఏకంగా రూ. 151.15 కోట్ల నిధులు మంజూరు చేయడంపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

షాద్‌నగర్ నియోజకవర్గానికి రూ. 151 కోట్లు

ఒక్క నెలలోనే మంజూరు.. రహదారుల నిర్మాణానికి రూ.108 కోట్లు

100 పడకల ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలకు రూ. 5.3కోట్లు

కేజీవీలకు రూ.3.85 కోట్లు .. ఆర్‌ఓబీ బాధితులకు రూ.34 కోట్ల పరిహారం

రహదారుల నిర్మాణానికి టెండర్లు

షాద్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ నియోజకవర్గానికి మంజూరైన నిధుల్లో అత్యధిక శాతం రహదారుల నిర్మాణానికి ఖర్చు చేయనున్నారు. తమ గ్రామాల పరిధిలో రహదారుల నిర్మాణం చేపట్టాలంటూ నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలకు చెందిన ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. దీంతో నియోజకవర్గ పరిధిలో రహదారుల పరిస్థితి గురించి ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల గురించి వివరించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కేవలం రహదారుల నిర్మాణానికే రూ.108 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో కొత్తూరు,

మిగతా 8వ పేజీలో...



కమ్యూనిటీ ఆస్పత్రి నూతన భవనం

118 మంది పౌల్ట్రీ రైతులకు లబ్ధి

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

ఎమ్మెల్యేను సన్మానించిన పౌల్ట్రీ రైతులు

పౌల్ట్రీ ఆస్తి పన్ను బకాయిల రద్దు

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలోని ఎంపీ శేషయ్యనగర్ పౌల్ట్రీ ఫారాల ఆస్తి పన్ను బకాయిలను రద్దు చేయించినట్లు ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ వెల్లడించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 118 మంది పౌల్ట్రీలకు సంబంధించిన రూ.5కోట్ల 50 లక్షల ఆస్తి పన్ను బకాయిలను రద్దు చేస్తూ ప్రభుత్వం జీవోను విడుదల చేసిందని తెలిపారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే పౌల్ట్రీలపై ఆస్తి పన్నును రద్దు చేయగా, చటాన్‌పల్లి గ్రామ పంచాయతీని షాద్‌నగర్ మున్సిపాలిటీలో చేర్చిన తర్వాత పౌల్ట్రీల ఆస్తి పన్ను చెల్లించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులపై ఒత్తిడి తెచ్చిందని గుర్తుచేశారు. రైతులు పన్ను చెల్లించకపోవడంతో కోర్టులో కూడా కేసు వేయించి ఇబ్బంది పెట్టారని తెలిపారు. వ్యవసాయానికి అనుబంధంగా కొనసాగుతున్న పౌల్ట్రీ రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి సమస్యను తెలిపి, ఆస్తి పన్ను బకాయిలను పూర్తిగా రద్దు చేయించామని తెలిపారు. కోర్టులో వేసిన కేసును కూడా ఉపసంహరింపజేస్తామని స్పష్టం చేశారు. కష్టజీవులైన పౌల్ట్రీ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పార్టీలకతీతంగా పౌల్ట్రీ సమస్యలను పరిష్కరించడమే కాకుండా ఎంపీ శేషయ్యనగర్ అభివృద్ధి కోసం రూ.50 లక్షలు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే శంకర్ వెల్లడించారు. ఈ సందర్భంగా పౌల్ట్రీ రైతులు సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి, స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వై.యాదయ్య, బాల్‌రాజ్‌గౌడ్, చెంది తిరుపతిరెడ్డి, రఘు, శ్రీకాంత్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, కొంకళ్ళ చెన్నయ్య, సోమేష్, పౌల్ట్రీ రైతులు కాప రామారావు, ఆనందరావు, జి. వసంతరావు, మాకినేని వెంకటనారాయణ, నువ్వుల శ్రీనువాస్‌రావు, ఎం. మల్లేశ్వర్‌రావు, సతీష్, సాంబ శివరావు, బి. కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను సన్మానిస్తున్న పౌల్ట్రీ రైతులు



పత్తికి ముసురు కష్టాలు

7

భారీగా పడిపోతున్న దిగుబడి

రైతులకు కలిసిరాని కాలం

దానాల్లోకెల్లా రక్తదానం గొప్పది

● ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి


ఘట్‌కేసర్‌లో రక్తదానం చేస్తున్న యువకులతో మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):అన్ని దానాల్లోకెల్లా రక్తదానం ఎంతో విలువైందని, గొప్పదని ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఘట్‌కేసర్‌లోని సెయింట్ అంథొనీస్ పాఠశాలలో నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. సాధారణంగా ఒక వ్యక్తి రక్తదానం చేయడం వలన ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణం పోస్తుందని అన్నారు. రక్తదానంపై అపోహలు వీడాలని కోరారు. ఒక వ్యక్తి సంవత్సరంలో నాలుగుసార్లు రక్తదానం చేయొచ్చని వివరించారు. రక్తదానంతో ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. కేవలం రెండు మూడు రోజు ల్లో శరీరంలో పోయిన రక్తం సమకూరుతుందన్నారు. ఇందుకు పండ్లు, ఆకు కూరలు, పాలు తీసుకుంటే సరిపోతుందన్నారు. అయితే రక్తదానం ఒకరికి ప్రాణదానం అవుతుంది కనుక యువత రక్తదానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా 55 మంది రక్తదానం చేశారు. శివానంద పిడియాట్రిక్ క్యాన్సర్ సెంటర్ బృందం రక్తాన్ని సేకరించింది. కార్యక్రమంలో డాక్టర్ శ్రవంతి, మాజీ కౌన్సిలర్ జహంగీర్, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

సదర్ ఉత్సవాన్ని విజయవంతం చేయాలి


సదర్ వేడుక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్, సంఘం నాయకులు

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలకు అతీతంగా యాదవ పండుగైన సదర్ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. షాద్‌నగర్‌లోని క్యాంప్ ఆఫీసులో ఆదివారం సదర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో సదర్ ఉత్సవ పోస్టర్ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సదర్ ఉత్సవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తుచేశారు. షాద్‌నగర్ మెయిన్ రోడ్డులో నవంబరు 2న నిర్వహించ తలపెట్టిన సదర్ ఉత్సవాన్ని విజయవంతం చేసేందుకు యాదవులంతా ఏకతాటిపైకి రావాలని కోరారు. కష్టజీవులైన యాదవులు రాజకీయాలకు అతీతంగా, మాటకు కట్టుబడి ఉండేవారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పాలనలో ఓటు బ్యాంకు రాజకీయ కోసం యాదవులను విచ్ఛిన్నం చేశారని ఆరోపించారు. పార్టీలు ఏమున్నా.. ఐకమత్యంతో ఉత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు వై.యాదయ్యయాదవ్, రాఘునాథ్‌యాదవ్, ఎన్.యాదగిరి, బి.అంజయ్య, షాబాద్ మల్లేష్‌యాదవ్, నక్క బాల్‌రాజ్, మాధవులు, పసుల నర్సింహ, తుమ్మల నర్సిహ యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, ప్రవీణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన
ఉపాధ్యాయుడి సస్పెన్షన్?

● నేడు ఉత్తర్వులు అందజేయనున్న ఎంఈవో

తాండూరు రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):కరన్‌కోట్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఓ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన సైన్స్ ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు సోమవారం(నేడు) ఉత్తర్వులు అందజేస్తామని ఎంఈవో వెంకటయ్య ఆదివారం తెలిపారు. కరన్‌కోట్ జెడ్పీ పాఠశాలలో ఓ బాలిక పట్ల సైన్స్ ఉపాధ్యాయుడు రాఘవేందర్‌రెడ్డి ఈ నెల 22న పాఠశాలలో అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు వెంటనే కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఉపాధ్యాయుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాండూరు ఎంఈవో వెంకటయ్య పాఠశాలలో విచారణ జరిపారు. నివేదికను డీఈవోకు అందజేశారు. నివేదిక ఆధారంగా సదరు టీచర్ తప్పు చేసినట్టు నిర్ధారించి డీఈవో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఉత్తర్వులను సోమవారం ఉపాధ్యాయుడికి పాఠశాలలో ఇస్తామని ఎంఈవో తెలిపారు.

ఘనాపూర్‌లో భక్తి శ్రద్ధలతో
మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం


స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న కాంగ్రెస్ బి-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేశ్‌గౌడ్-మమత దంపతులు, గ్రామస్తులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి ఘనాపూర్‌లో ఆదివారం మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. కాంగ్రెస్ బి-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేశ్‌గౌడ్ నివాసంలో ఒగ్గు కళాకారుల ఆటపాటల మధ్య మల్లన్న కల్యాణాన్ని జరిపించారు. ఈ కార్యక్రమంలో మహేశ్‌గౌడ్-మమత దంపతులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పీర్జాదిగూడ మాజీ డిప్యూటీ మేయర్ రవిగౌడ్, బొక్క ప్రభాకర్‌రెడ్డి, అర్జున్, నాయకులు బాలగౌని నర్సింహాగౌడ్, వేముల పరమేశ్‌గౌడ్, బొక్క సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును కప్పేసిన చెట్లు

● రూ.6వేల సొంత డబ్బు వెచ్చించి నరికివేయించిన పోలీసులు
● ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్న రక్షక భటులు
● పోలీసుల సాయంపై తక్కళ్లపల్లి, కొత్తపల్లి గ్రామస్తుల హర్షం


నాగార్జున సాగర్ రహదారి నుంచి తక్కళ్లపల్లి వరకు ఉన్న రోడ్డుపైకి వచ్చిన చెట్లను తొలగింపజేస్తున్న పోలీసులు

యాచారం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగార్జున సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారి నుంచి తక్కళ్లపల్లి-కొత్తపల్లి గ్రామాలకు వెళ్లే దారిని రోడ్డుకిరువైపుల భారీ చెట్లు రోడ్డును ఆక్రమించాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించకుండా చెట్లు రోడ్డును కమ్మేశాయి. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయం గమనించిన యాచారం సీఐ ఏ.నందీశ్వర్‌రెడ్డి, ఎస్సైలు యు. మధు, ప్రియాంకలు తమ సిబ్బందితో రోడ్డును ఆక్రమించిన చెట్లను ఆదివారం నరికివేయించారు. పోలీసులు సొంతంగా రూ.6వేలు వెచ్చించి ఎక్స్‌కవేటర్‌తో చెట్లను నరికి వేయించారు. ఆరు కిలోమీటర్ల వరకు రోడ్డును ఆక్రమించిన చెట్లన్నింటినీ నరికి వేయించారు. అలాగే రోడ్డు పక్కన మట్టిపోయించి చదును చేయించారు. పోలీసులు తమ గ్రామాలకు వెళ్లే రోడ్డును ఆక్రమించిన చెట్లను తొలగించి మేలు చేశారని తక్కళ్లపల్లి, కొత్తపల్లి గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఏ పోలీస్ అధికారి కూడా ఇలాంటి పనులు చేయించలేదని, నేడున్న సీఐ, ఎస్సైలు ప్రజల సమస్యలను తీర్చడం ప్రశంసనీయమని ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.


రోడ్డును కప్పేస్తున్న చెట్లను తొలగిస్తున్న పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లు

షెడ్ల నిర్మాణానికి భూమిపూజ


షెడ్డు నిర్మాణ భూమిపూజలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, నాయకులు

దుద్యాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలెపల్లి రేణుక ఎల్లమ్మ ఆలయం పక్కన మటన్(కబేళా) షెడ్డు నిర్మాణానికి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆకారం వేణుగోపాల్, ఆలయ చైర్మన్ జయరాములు ఆదివారం భూమిపూజ చేశారు. రూ.30లక్షలతో షెడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, కుమారస్వామి, సింగర్ నరసింహ, చంద్రయ్య, నరసింహ, కృష్ణ, వెంకటయ్యగౌడ్, యాదయ్యగౌడ్, ముస్తాక్, కొండయ్య, వెంకటయ్య, సాయిలుగౌడ్, రాములు, భగవంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎల్వోసీ అందజేత


ఎల్వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న వారికి సీఎంఆర్ఎఫ్ కింద ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆదివారం ఎల్వోసీలను అందజేశారు. యాలాల మండలం పగిడ్యాలకు చెందిన రాస్నం అరుణకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.2లక్షలు, పెద్దేముల్ మండలం రుద్రారానికి చెందిన లలితకు రూ.2.25లక్షల ఎల్‌ఓసీని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, నాయకులు లొంక నర్సిములు, ఉప్పరి మల్లేశం తదితరులు ఉన్నారు.

సాంకేతిక బోధన అందించాలి


ఓపెన్ స్కూల్ కేంద్రాన్ని సందర్శించిన అరుణ

పరిగి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):ఓపెన్ స్కూల్ విద్యార్థులకు సాంకేతిక బోధనను అందించాలని టీవోఎస్ఎస్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ అరుణ అన్నారు. ఆదివారం పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నం.1, 2స్కూళ్లలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ తరగతులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి వారం నిర్వహించే తరగతులకు క్రమం తప్పక హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు పాఠాలు వింటేనే పరీక్షలు రాయగలుగుతారని చెప్పారు. ఓపెన్ స్కూల్ పరీక్ష కేంద్రాలు అందుబాటులో లేని కారణంగా పరీక్షలు రాయలేకపోతున్నామని, నియోజకవర్గ కేంద్రాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంఈవో గోపాల్, టీచర్లు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి యువ ఆచార్య అవార్డు


అవార్డు స్వీకరిస్తున్న సీఎంఆర్ అధ్యాపకుడు జి.మధుకర్

మేడ్చల్ టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్సీ పురస్కారంలో భాగంగా సీఎంఆర్ కళాశాల అధ్యాపకుడు మధుకర్‌కు యువ ఆచార్య అవార్డు దక్కింది. అఖిలభారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) స్టేట్ కోఆర్డినేటర్ బుద్ధ చంద్రశేఖర్ నుంచి అవార్డు అందుకున్నారు. సాంకేతిక విద్య బోధనతో పాటు, విద్యారంగంలో పరిశోధనల పట్ల ప్రతిభ కనబర్చే అధ్యాపకులకు బ్రోయినో విజన్ సంస్థ అవార్డులను అందజేస్తోంది. ఈ సందర్భంగా సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అభినవ్‌రెడ్డి, డైరెక్టర్ ఎ.రాజిరెడ్డి, డీన్ భాస్కర్ తదితరులు మధుకర్‌కు అభినందనలు తెలిపారు.

పోలీసులకే రక్షణ లేకపోతే ఎలా?


నరేందర్‌రెడ్డి

కేశంపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో పోలీసులకే రక్షణ లేకపోతే ఎలా? అని బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగం కోకన్వీనర్ కర్రెడ్ల నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కేశంపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శనివారం హైదరాబాద్‌లో సెల్‌ఫోన్ దొంగతనం చేసి పారిపోతున్న ఇద్దరు దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించిన డీసీపీ చైతన్యకుమార్, ఆయన గన్‌మన్ మూర్తిలపై దొంగలు కత్తితో దాడి చేశారని తెలిపారు. పోలీసులపై దాడిని ఖండిస్తున్నామన్నారు. నిజామాబాద్‌లో సీసీఎస్ కానిస్టేబుల్ హత్య, అలాగే హైదరాబాద్ సమీపంలో గోరక్షక్‌పై కాల్పులు జరిగాయన్నారు. రాష్ట్రంలో లాఅండ్‌ఆర్డర్ గతి తప్పుతోందని, ఇందుకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. రాష్ట్రంలో వెంటనే హోంశాఖ మంత్రిని నియమించి శాంతి భద్రతలను పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు.

మేడ్చల్‌లో నీటి తిప్పలు

» గత్యంతరం లేక బోర్లు, ట్యాంకర్లపై ఆధారపడుతున్న పట్టణ వాసులు

» ఎద్దడి తీర్చాలని అధికారులకు వేడుకోలు

మేడ్చల్ టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణ వాసులకు నీటి కష్టాలు తప్పటం లేదు. వేసవి నుంచి ఇప్పటి వరకు మంచినీటి సమస్యను అధికారులు పరిష్కరించడం లేదని స్థానికులు వాపోతున్నారు. మున్సిపాలిటీ పరిధి వార్డుల్లో రెండు రోజులకు ఒకసారి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే నాలుగు నెలలుగా మున్సిపల్ పరిధిలోని ఏ ఒక్క వార్డులోనూ ప్రజలకు సరిపడా నీరు వదలడం లేదు. దీంతో చాలా మంది ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని కొంటున్నారు. ఈ సమస్యపై ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు పలుమార్లు మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకుపోయినా తమ చేతుల్లో ఏమీ లేదని చేతులెత్తేస్తున్నారు. మేడ్చల్‌కు మిషన్ భగీరథ నీరు సరఫరా చేసే పంప్ హౌజ్‌కు పైనుంచే సరిపడా నీరు వదలడం లేదని అధికారులే ఒప్పుకుంటున్నారు. గాగిల్లాపూర్, నిజాంపేట్ మున్సిపాలిటీలకు నీరు సరిపోవటం లేదని మిషన్ భగీరథ ఉన్నతాధికారులు మేడ్చల్ మున్సిపాలిటీకి నీటి కోత విధించి ఆ మున్సిపాలిటీలకు నీరు వదుల్తున్నందున మేడ్చల్‌కు ఈ సమస్య తలెత్తిందని కొందరు అధికారులు తెలిపారు. ఒక వైపు వర్షాలు పుష్కలంగా కురిసినా పట్టణ ప్రజల దాహార్తి మాత్రం తీరడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ట్యాంకర్ల ద్వారా సరఫరా

నీటి కొరతను అధిగమించేందుకు మున్సిపల్ అధికారులు బోర్ల ద్వారా నల్లా నీటిని సరఫరా చేసే పనిలో పడ్డారు. పైప్‌లైన్ లేని ప్రాంతాలకు ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే నీటి సమస్యను పరిష్కరించాలని 64 పాత బోర్లను అధికారులు పునరుద్ధరించి వాటిలో మోటార్లు బిగించే పనిలో పడ్డారు. ఈ బోర్ల నీటిని ఓవర్ హెడ్ ట్యాంకులు నింపి నీటిని సరఫరా చేసి నల్లాల ద్వారా ఇంటింటికి నీటి సరఫరాకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మున్సిపల్ ట్యాంకర్లతో పాటు ప్రైవేట్ ట్యాంకర్లను అద్దెకు తీసుకుని మొత్తం 12 ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నారు.

సరఫరా తగ్గించిన మిషన్ భగీరథ అధికారులు



మేడ్చల్‌లో మున్సిపల్ ట్యాంకర్ ద్వారా చేస్తున్న నీటి సరఫరా

ఫ్లోరైడ్ నీటితో సరిపెట్టుకునే దుస్థితి..

వర్షాలు పుష్కలంగా కురవడంతో మేడ్చల్‌లోని అన్ని ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు పుష్కలంగా పెరిగాయి. వేసవిలో ఎండిన బోరు బావులు రీచార్జి అయి చాలా కాలనీల్లో సొంత బోర్లతో నీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. అయితే వ్యక్తిగత బోర్ల నీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఈ నీటిని వినియోగించేందుకు ఇష్టపడటం లేదు. కొన్నేళ్లుగా మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న ప్యూరిఫైడ్ గోదావరి జలాలకు ప్రజలు అలవాటు పడ్డారు. ఇదే నీటిని తాగేందుకు, ఇతర అవసరాలకు వాడుతున్నారు. పట్టణంలో చాలా మంది తమ బోర్ల వాడకాన్ని నిలిపేశారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప బోరు నీటిని వాడని ప్రజలు ఇప్పుడు గత్యంతరం లేక బోర్లపై ఆధారపడుతున్నారు. తాగేందుకు ఆర్వో నీటికి కొనుక్కుంటున్నారు.

నాయకుల వైఫల్యమే అంటున్న ప్రజలు

మేడ్చల్ మున్సిపాలిటీకి కేటాయించిన మిషన్ భగీరథ నీటి వాటాను ఇతర మున్సిపాలిటీలకు విడుదల చేస్తున్నప్పటికీ అధికార పార్టీ నాయకులు నోరు మెదపక పోవటం పట్ల స్థానికులు మండి పడుతున్నారు. ఈ విషయంలో స్థానిక ఎంపీ ఈటల రాజేందర్ పలుమార్లు మిషన్ భగీరథ అధికారులు, జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకు పోయినప్పటికీ ప్రయోజనం చేకూర లేదు. ఇక స్థానిక ఎమ్మెల్యేకు ఈ విషయం పట్ల పట్టించుకునే పాపాన పోవటం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమస్య నుంచి గట్టెక్కించే అధికార పార్టీ నాయకులకు పట్టింపు లేకుండా పోవటంతో నీటి సమస్య గురించి పట్టించుకునే నాథులు లేకుండా పోయాడని స్థానికులు వాపోతున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్య పై ఇక నైన నాయకులు అధికారులు స్పందించి ప్రతి వార్డుకు సరిపడు నీరును సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పక్షం రోజులుగా తాగునీటి తండ్లాట

పెద్దేముల్: మండలంలోని గాజీపూర్ గ్రామంలోని ఒకట వార్డు ప్రజలు తాగునీటికి తండ్లాడుతున్నారు. మోటారు పాడై 15 రోజులు కావస్తున్నా పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తాగునీటి సమస్య తీర్చండి సారూ.. అంటూ ఆదివారం పాడైన బోరు మోటారు వద్ద వార్డు ప్రజలు నిరసన చేపట్టారు. మిషన్ భగీరథ నీరు నిత్యం రావడం లేదని రెండు, మూడు రోజులకోసారి వస్తుండడంతో తాగునీటి సమస్య తీవ్రమవుతున్నదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


పాడైన బోరు వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు


షాబాద్‌లో రిలే దీక్షలు చేస్తున్న నాయకులు

బీసీలకు 42శాతం రిజర్వేషన్లివ్వాలి

షాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని రిజర్వేషన్ సాధన సమితి సభ్యులు మాణిక్యం, శేఖర్, రాజేందర్‌గౌడ్, రవి, చేవెళ్ల స్వామి, నర్సింలు, కిరణ్, శ్రీశైలం, చంద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ షాబాద్‌లో 15రోజులుగా షాబాద్‌లో రిలే నిరాహారదీక్షలు చేపడుతున్నారు. నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఐక్యతతోనే రిజర్వేషన్లు సాధ్యమన్నారు. పార్లమెంట్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టేలా పార్లమెంట్ సభ్యులు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జ్ఞానం అందించేవాడే కవి

» జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి


శ్రీ సాయి, ప్రకృతి వైద్య శతకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

వికారాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కవి తన చుట్టూ ఉన్న సమస్యలను పరిశీలించి, పద్య రూపంలో సమాజానికి జ్ఞానం అందిస్తారని, శతకాల ద్వారా మానవ విలువలను పెంపొందిస్తారని జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం వికారాబాద్‌లో పద్యపద భారతి సాహిత్య సాంస్కృతిక కళావేదిక ఆధ్వర్యంలో సంకల్ప్ విద్యాపీఠంలో డైట్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ బందప్పగౌడ్ రచించిన శ్రీ సాయి శతకం, ప్రకృతి వైద్య శతకం ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. పాల్కూరి నుంచి నేటి వరకు పలువురు కవులు, రచయితలు సమాజ శ్రేయస్సు కోసం రచనలు సాగించారని తెలిపారు. డాక్టర్ తూర్పు మల్లారెడ్డి, గంటా మనోహర్ రెడ్డి, సీపీరెడ్డిలు మాట్లాడుతూ.. సాయి శతకం, ప్రకృతి వైద్య శతకం రాయడం అభినందనీయమని, ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రజలు పాశ్చాత్య ఆహార అలవాట్లతో రోగాల బారిన పడుతున్నారని, భారతీయ ఆయుర్వేద విలువలను ఆధునికీకరించి ప్రజలకు చేరవేయాలన్నారు. ఇంద్రియాలు, ఆత్మ కలిసినపుడు ఆయుర్వేదంతో ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ మొరంగపల్లి బాగయ్య, అంజయ్య, ధన్‌శెట్టి బొబ్లాద్ రాఘవేంద్రచార్యులు, మల్కానెల్లి లాల్‌రెడ్డి, పోలె విశ్వనాథం, సుధాకర్‌గౌడ్, డాక్టర్ మున్నూరు రోజా, రెడ్యారాథోడ్, శ్రీనివాసచారి, దివాకర్‌శాస్త్రి, శంకరయ్య, మొగులయ్య, మాణిక్యరావు, కులకర్ణి సుదర్శనరావు పాల్గొన్నారు.

పిట్టల శ్రీశైలానికి రైతు నేస్తం అవార్డు


రైతు నేస్తం అవార్డు అందుకుంటున్న పిట్టల శ్రీశైలం

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో రైతులకు అండగా నిలుస్తున్న ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని అంకుశాపూర్‌కు చెందిన పిట్టల శ్రీశైలంకు రైతు నేస్తం అవార్డు దక్కింది. ఈ మేరకు భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రైతునేస్తం 21వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం శంషాబాద్‌లో ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఐవీ సుబ్బారావు పేరిట అవార్డులను అందజేశారు. పిట్టల శ్రీశైలం సీనియర్ జర్నలిస్టు అయినా వ్యవసాయంపై మక్కువతో ప్రకృతి వ్యవసాయం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచాడు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రైతు విభాగం నుంచి 12 మందికి, శాస్త్రవేత్త విభాగం నుంచి 12 మందికి, నూతన ఆవిష్కరణ విభాగంలో ఐదుగురికి, విస్తరణ విభాగం నుంచి మరో 12 మందికి రైతు నేస్తం అవార్డు దక్కింది. ఈ కార్యక్రమంలో రైతు నేస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు పద్మశ్రీ యడ్లపల్లి వెంకటేశ్వరావు, ముప్పవరపు ఫౌండేషన్ అధ్యక్షుడు హర్షవర్ధన్, వ్యవసాయశాఖ నిపుణులు కొసరాజు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక నాయకులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మేకల పద్మారావు, సత్యం, లింగస్వామి, చిలక గణేష్, సామాజిక కార్యకర్త సందుపట్ల నవజీవన్‌రెడ్డి, కుంటోళ్ల యాదగిరి పిట్టల శ్రీశైలంను అభినందించారు.

పత్తికి ముసురు కష్టాలు

» భారీగా పడిపోతున్న దిగుబడి

» పత్తి రైతులకు కలిసిరాని కాలం

చౌదరిగూడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులకు ముసురు వర్షంతో కష్టాలు మొదలయ్యాయి. పండించిన పంటలు వర్షార్పణం అవుతున్నాయి. ఇటీవలి, గతంలో కురిసి భారీ వర్షాలకు మొక్కజొన్న, కంది పంటల దిగుబడి తగ్గింది. ప్రస్తుతం కురుస్తున్న ముసురుతో పత్తి పంటకు తీవ్ర నష్టం జరిగే ఆస్కారం ఏర్పడింది.

నల్లబారుతున్న తెల్ల బంగారం ...

జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో 6వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. భారీ వర్షాలతో పత్తి పంట దిగుబడి తగ్గి ఎకరానికి 4 నుంచి 5క్వింటాళ్లు మాత్రమే వచ్చేలా ఉందని రైతులు వాపోతున్నారు. పంటల కోత దశలో ఇప్పుడు కురుస్తున్న ముసురుతో మరింత నష్టం వాటిల్లుతోంది. చెట్టుపైనే పత్తి నల్లబారుతోంది. రోగాలు సోకి కాయలు కుళ్లుతున్నాయి. పగిలిన పత్తి ముసురుతో నల్లబారుతోంది. తడిసి ముద్దయిన పత్తి తీసేందుకు కూడా వీలవడం లేదు. పత్తి గింజలు రాలి చెట్టుపైనే మొలకెత్తుతున్నాయి. దీంతో రైతులకు ఏం చేయాలో తోచడం లేదు. పెట్టుబడైనా వస్తుందా? అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది పత్తి రైతులు దారుణంగా నష్టపోతున్నారు. పత్తితో పాటు వానకాలంలో సాగుచేసిన వరి, మొక్కజొన్న, కంది, జొన్న పంటల పరిస్థితి పత్తి తరహాలోనే ఉంది. వానకాలంలో మండలంలో వరి 7,400 ఎకరాల్లో, పత్తి 6వేలు, మొక్కజొన్న 4,023 ఎకరాల్లో, కందులు 580ఎకరాలు, జొన్న 190 ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు లెక్క తేల్చారు.


వనంపల్లిలో పగిలిన పత్తి

పెట్టుబడైనా వచ్చేలా లేదు



ఈ ఏడాది నేను ఐదు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. భారీ వర్షాలకు ఎకరాని 4 క్వింటాళ్ల దిగుబడైనా వచ్చే అవకాశం లేదు. పెట్టుబడి ఖర్చులైనా వచ్చే పరిస్థితి కన్పించడం లేదు. ఈ సారి పత్తి రైతులకు నష్టం తప్పేలా లేదు. పోయిన సారి దిగుబడి బాగుండి, ధర కూడా ఎక్కువగా ఉందన్న ఆశతో చాలా మంది రైతులు పత్తి విస్తీర్ణాన్ని పెంచారు.

- కొండి యాదయ్య, రైతు, ఎల్కగూడ

రైతులను ఆదుకోవాలి



వర్షాల కారణంగా పంటలకు తెగుళ్ల సోకి దిగుబడి తగ్గిపోయింది. పెట్టుబడి రాక అప్పులు మిగిలేలా పరిస్థితి ఉంది. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- బంగారు బాల్‌రాజ్, రైతు, తుమ్మలపల్లి

వర్షాలతో పంటలకు నష్టం


కులకచర్ల శివారులో నేలకొరిగిన వరి చేను

కులకచర్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా నిరంతరం కురుస్తున్న చినుకులు, గాలి కారణంగా పంటలు నేలకొరుగుతున్నాయి. రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు వరి పంట పాక్షికంగా దెబ్బతింది. వర్షంతో వరి నేలకొరిగింది. వరి పంటకు వివిధ రకాల తెగుళ్లు సోకడంతో పురుగుల మందు పిచికారి ఎక్కువగా చేశారు. వరి చేలు నేలవాలి మొలకొచ్చేలా ఉంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కాల్పుల కేసు నిందితుడి కోసం గాలింపు

» బృందాలుగా పోలీసుల సెర్చ్ ఆపరేషన్

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గోరక్షక్ దళ సభ్యుడు ప్రశాంత్ అలియాస్ సోనూసింగ్‌పై కాల్పులు జరిపిన నిందితుడి వేటలో పోలీసులు ఉన్నారు. యంనంపేట్‌లోని కిట్టి స్టీల్ ఎదురుగా ఉన్న ఓ వెంచర్‌లో ఈ నెల 22న ప్రశాంత్‌పై హైదరాబాద్‌లోని బహదూర్‌పురకు చెందిన ఇబ్రహీం ఖురేషీ(24) తుపాకీతో కాల్చి, తన స్నేహితులైన మస్నాబిన్ మోసిన్(22), కురువ శ్రీనివాస్(30), హనీఫ్ ఖురేషీ(34)లతో కలిసి కారులో పరారయ్యారు. రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. 9 బృందాలుగా ఏర్పడిన పోలీసులు కొన్ని గంటల్లోనే మహ్మద్ ఇబ్రహీం ఖురేషీ, కురువ శ్రీనివాస్, మోసిన్‌లను అరెస్టు చేశారు. మరో నిందితుడు హనీఫ్ ఖురేషీ తప్పించుకున్నాడు. 23న ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. కాగా పరారీలో ఉన్న హనీఫ్ ఖురేషీ కోసం నాలుగు పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. హైదరాబాద్ పాతబస్తీతో పాటు ముంబాయి, పుణె తదితర ప్రాంతాల్లో గాలిస్తున్నారు. నిందితుడు హనీఫ్ ఖురేషీని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

ఘట్‌కేసర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని అన్నిరంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు నర్సింహ అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎదులాబాద్ రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేటి యువత విలాసాల పేరుతో సమయం వృథా చేయకుండా వకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి కృషి చేయాలన్నారు. ప్రధానంగా విద్యార్థులు విద్యలో రాణించడానికి నిరంతరం శ్రమించాలన్నారు. ఉన్నత విద్యతోనే అంబేడ్కర్ రాజ్యాంగ రచనలో తనవంతు పాత్రను పోషించాడని గుర్తుచేశారు. ఆమహనీయున్ని ఆదర్శంగా తీసుకొని యువతరం అన్ని రంగాల్లో ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీసాల అరుణ్‌కుమార్, నర్సింగరావు, సత్యం, నారాయణ, వేణుగోపాల్, గణేష్, ఆనంద్, నిఖిల్ పాల్గొన్నారు.

ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పథకాలను అమలు చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో పేదల సొంతింటి కల సాకారమవుతోందని చెప్పారు. సాలార్‌పూర్‌లో నిర్మించిన కెతావత్ దోళి ఇందిరమ్మ ఇంటిని ఆదివారం ఎమ్మెల్యే, ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డిలు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిరుపేదలకు ఒక్క ఇల్లూ కట్టివ్వలేదని ఆరోపించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో కాలయాపన చేశారని విమర్శించారు. పేదల ఆత్మగౌరవానికి ఇందిరమ్మ ఇళ్లు ప్రతీకగా నిలుస్తున్నాయని అన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకున్న వారికి బిల్లుల చెల్లింపుల్లో జాప్యం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల మంజూరు, నిర్మాణం అనేది నిరంతర ప్రక్రియలని, రెండో విడతలో మరికొందరికి ఇళ్లు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ చేగూరి వెంకటేష్, మార్కెట్ డైరెక్టర్ మిట్టపల్లి అంజయ్య, నాయకులు శంకర్, మోహన్, శ్రీశైల, సిలారి, ఎక్బాల్, రాజు, శ్రీను, హరి, కుమార్, లింగం, విష్ణు, వెంకట్‌రెడ్డి, షాబుద్దీన్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

బాధిత కుటుంబాలకు పరామర్శ

రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న మక్తమాదారం గ్రామానికి చెందిన రాజమోని లక్ష్మయ్యను ఎమ్మెల్యే నారాయణరెడ్డి పరామర్శించారు. అవేర్ ఆస్పత్రిలో లక్ష్మయ్యను ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.4వేల సాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీత, నాయకులు అంజయ్య, బాల్‌రాజ్, నర్సింహ తదితరులు ఉన్నారు. అలాగే సాలార్‌పూర్ తండాలో ఇటీవల మృతిచెందిన లింగమ్మ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి రూ.8వేల సాయం అందించారు.

ఉప ఎన్నిక ప్రచారంలో కల్వకుర్తి నేతలు

ఆమనగల్లు: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారానికి కల్వకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఎమ్మెల్యేకు కేటాయించిన పోలింగ్ బూత్‌ల పరిధిలో ఎమ్మెల్యేతో కలిసి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ విజయం ఖాయమని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, హన్మనాయక్, మండ్లీ రాములు, యాట నర్సింహ, ఆనంద్, గుర్రం కేశవులు, వెంకటేశ్ లక్పతినాయక్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవనం



పూజలో రఘురామ్ రాథోడ్, లక్పతి నాయక్ తదితరులు

కడ్తాల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవనం పొందవచ్చునని మైదాన ప్రాంత సేవాలాల్ సేన కన్వీనర్ రఘురామ్ రాథోడ్, రాష్ట్ర నాయకులు లక్పతినాయక్, అజయ్ నాయక్‌లు అన్నారు. లంబాడీల ఆరాధ్య దైవం తుల్జాభవానీ మాత అని అన్నారు. కడ్తాల మండలం కానుగుబావి తండాలో నూతనంగా నిర్మించిన తుల్జాభవానీ మాత దేవాలయాన్ని ఆదివారం సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు వారిని సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కానుగుబావితండా గిరిజనులు ఏకమై తుల్జాభవానీ మాత ఆలయాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. బీమ్లానాయక్, నరేశ్‌నాయక్, జెమ్లు నాయక్, శ్రీనివాస్ నాయక్, బీక్యనాయక్, పాండు నాయక్, హరిచంద్ నాయక్, మోత్యనాయక్, రాజు, రతన్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?

- అధ్వానంగా ఆకుతోటపల్లి-సింగపల్లి రహదారి
- వాహనదారుల ఇక్కట్లు.. పట్టని పాలకులు, అధికారులు

ఆమనగల్లు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆకుతోటపల్లి-సింగపల్లి రోడ్డు పూర్తిగా పాడై కాలినడకకు సైతం ఇబ్బంది మారింది. రోడ్డుపై పెద్ద గోతులేర్పడి నరకప్రాయంగా తయారైంది. దాంతో రాకపోకలకు వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే గోతుల్లోకి నీరు చేరి కుంటలను తలపిస్తోంది. సింగంపల్లి గ్రామానికి వెళ్లడానికి బస్సు సౌకర్యం లేదు. ఆటోల డ్రైవర్లు సైతం రోడ్డును చూసి గ్రామానికి రావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధులు స్పందించి సింగంపల్లికి వెళ్లే మట్టిరోడ్డును బీటీ రోడ్డుగా మార్చి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నీటికుంటలను తలపిస్తున్న ఆకుతోటపల్లి-సింగపల్లి రోడ్డు

క్రైం కార్నర్

ప్రేయసి పెళ్లికి నిరాకరించిందని..
యువకుడి ఆత్మహత్య

శంషాబాద్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించిన ప్రేయసి తనను దూరం పెడుతోందని, పెళ్లికి నిరాకరిస్తోందని మానసిక వేదనకు గురైన ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం శంషాబాద్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శంషాబాద్ మున్సిపాటిటీ పరిధిలోని రాళ్లగూడ ఇంద్రారెడ్డి కాలనీకి చెందిన వడ్డె మధు(26) ఓ అమ్మాయిని ఎంతగానో ప్రేమించాడు. ఈక్రమంలో ఆమె అతడిని దూరం పెడుతోందని మానసిక వేదనకు గురయ్యాడు. ఆ అమ్మాయితో పెళ్లి చేయాలని, ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించానని.. ఆమె వల్ల తన పల్సర్ బైక్ కూడా పోగొట్టుకున్నానని.. ఇప్పుడు తాను నన్ను పెళ్లి చేసుకోనని చెబుతోందని.. ఓ సూసైడ్ నోట్‌రాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడు మధు సోదరుడు మహేశ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ సీఐ బాల్‌రాజ్ తెలిపారు.

నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి కిందపడి కార్మికుడు దుర్మరణం

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధి శేరిగూడ శ్రీ ఇందు ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి కిందపడి ఒడిషాకు చెందిన ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఒడిషాలోని జరియా జిల్లాకు చెందిన దినకర్ బాత్రా(27) శనివారం నిర్మాణంలో ఉన్న రెండో అంతస్తులో సెంట్రింగ్ డబ్బాలు బిగించే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. కళాశాల యాజమాన్యం మృతదేహాన్ని గుట్టుచప్పుడు గాకుండా ఒడిషాకు పంపేందుకు ఏర్పాట్లు చేయగా సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీకి తరలించి ఆదివారం పోస్టు మార్టం చేయించి ఒడిషాకు పంపించారు. కాగా, మృతుడి కుటుంబానికి కళాశాల యాజమాన్యం రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని సీఐటీయూ మున్సిపాలిటీఅ కన్వీనర్ చింతపట్ల ఎల్లేశ్ డిమాండ్ చేశారు.

పాషా, నరహరిలను ఆదర్శంగా తీసుకోవాలి



కందుకూరు : పాషా, నరహరిలకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కందుకూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నిరుపేదల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిపోయిన కామ్రేడ్స్ పాషా, నరహరిలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం మండల కార్యవర్గ సభ్యుడు బుడ్డీరపు శ్రీనివాస్ కోరారు. పాషా, నరహరిల 36వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం కందుకూరు మండలంలోని నేదునూరు గ్రామంలో ఏర్పాటుచేసిన సభకు ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు శ్రీరాములు, ఎ.కుమార్, శేఖర్ మధు, తదితరులు పాల్గొన్నారు.

యాచారం : పేదల సమస్యలను పరిష్కరించడానికి ప్రాణాలను తృణప్రాయంగా వదులుకున్న పాషా, నరహరిల ఆశయ సాధనకు కార్యకర్తలు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా సీపీఎం నాయకుడు పి.బ్రహ్మయ్య అన్నారు. యాచారం మండల కేంద్రంలో పాషా, నరహరిల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో పాషా, నరహరిలు సీపీఎంను బలోపేతం చేయడంతో పాటు పేదలకు భూముల పంపకం వంటి మంచి పనులు చేశారని చెప్పారు. కాగా, కుర్మిద్ద, చిన్నతూండ్ల, చింతపట్ల తదితర గ్రామాల్లో సీపీఎం నాయకులు, కార్యకర్తలు వారి పాషా, నరహరిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం కార్యకర్తలు అంజయ్య, మల్లేశ్, ధనరాజ్, గోవర్ధన్, సురేష్ తదితరులు ఉన్నారు.



యాచారం : నివాళులర్పిస్తున్న నాయకులు

‘మిషన్ భగీరథ’ కార్మికులకు వేతనాలు మంజూరు చేయాలి

కందుకూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ లో ఉన్న రెండు నెలల వేతనాలను వెంటనే మంజూరు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి బుడ్డీరపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం మండలంలోని ముచ్చర్లలో గల నీటి శుద్ధి కేంద్రంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సమస్యలు పరిష్కరించాలని ఆయనకు కార్మికులు ఆయనకు విన్నవించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ జీవో 26 ప్రకారం కార్మికులకు పనికి తగిన వేతనాలను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న శ్రీనివాస్

అఖిల భారత యాదవ హక్కుల పోరాట సమితి మండలాధ్యక్షుడిగా శ్రీశైలం



శ్రీశైలానికి నియామక పత్రం ఇస్తున్న యాదగిరి యాదవ్

కేశంపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ హక్కుల పోరాట సమితి కేశంపేట మండలాధ్యక్షుడిగా కేశంపేటకు చెందిన బొజ్జం శ్రీశైలంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని యాదవ సంఘం కార్యాలయంలో నియోజకవర్గ అధ్యక్షుడు నడికూడ యాదగిరి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొజ్జం శ్రీశైలం యాదవ్, ఉపాధ్యక్షుడిగా మంచె కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా బొగ మల్లయ్య, కోశాధికారిగా అనెమోని మల్లేష్ యాదవ్, కార్యదర్శిగా వట్టెల లింగం, కార్యవర్గ సభ్యులుగా ఆలుగడ్డ మల్లేష్ యాదవ్, పిల్లి అమ్రేశ్, బోగ దశరథ్, నక్క గోపాల్‌యాదవ్, బైకని శేఖర్‌యాదవ్, వట్టెల రమేష్‌యాదవ్, అనెమోని శ్రీనివాస్ యాదవ్, మహేష్, మల్లేష్ యాదవ్‌లను ఎన్నుకున్నారు. కాగా, నవంబరు 2న నిర్వహించే సదర్ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువత విభాగం అధ్యక్షుడు నడికూడ అశోక్ యాదవ్, ప్రధాన కార్యదర్శి అనెమోని నరసింహులు యాదవ్, ఉపాధ్యక్షుడు పిప్పళ్ల వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



పెద్దతూప్రలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్

శంషాబాద్ రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలని మాజీ ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్ అన్నారు. బీఆర్ఎస్ అధిష్టానం ఆదేశానుసారం, పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి సూచనల మేరకు ఆదివారం శంషాబాద్ మండలంలోని వివిధ గ్రామాల్లో మండలాధ్యక్షుడు మంచర్ల మోహన్‌రావు అధ్యక్షతన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జయమ్మ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆమె అన్నారు. అదేవిధంగా బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యపడుతుందని జయమ్మ శ్రీనివాస్ అన్నారు. ఆయా సమావేశాల్లో డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీశ్, మాజీ సర్పంచ్ దేవుపల్లి సత్యనారాయణగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్‌పాషా, మాజీ సర్పంచ్ బిక్యానాయక్, మాజీ ఉప సర్పంచ్ బొగ్గుల లక్ష్మయ్య, వెంకటయ్య, రాజు, మాజీ వార్డు సభ్యులు దాస్, గోవింద్, ప్యాక్స్ డైరెక్టర్లు గౌతమ్, అంకం బాలయ్య, రవి, నరేశ్, విద్యాచరణ్, రాజు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆమనగల్లు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డ్ పరిధిలోని తలకొండపల్లి శ్రీనివాస మురుగన్ జిన్నింగ్ మిల్లులో నేడు(సోమవారం) సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతా నర్సింహ తెలిపారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గీత మాట్లాడుతూ పత్తి కొనుగోళ్లకు మార్కెట్ యార్డ్ పరిధిలో మూడు మిల్లులను సీసీఐ నోటిఫైడ్ చేసినట్లు తెలిపారు. రైతులు పత్తిని సీసీ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలన్నారు. దళారి వ్యవస్థను సమూలంగా నిర్మూలించి రైతులకు మద్దతు ధర కల్పించడానికి సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్ పరిధిలోని ఆమనగల్లు మండలం పోలెపల్లి అభిషేక్ కాటన్ మిల్స్, ఆకుతోటపల్లి ఎన్‌డీటీ కాటన్ ఇండస్ట్రీకి పత్తి కొనుగోళ్లకు సీసీఐ అనుమతించినట్లు వెల్లడించారు. పత్తి రైతులు దిగుబడి విక్రయానికి ముందుగా కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని గీత సూచించారు.

‘లక్కు’న్నోళ్లకే ‘కిక్కు’!

(ఐదో పేజీ తరువాయి)

138 మద్యం షాపులకుగాను 7,845 దరఖాస్తులు రాగా వీటిలో 6,113 మంది పురుషులు, 1,732 మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. శంషాబాద్‌లోని మల్లికా కన్వెన్షన్‌లో ఉదయం 11 గంటలకు డ్రా తీసేందుకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. దరఖాస్తుదారులు గంట ముందుగానే డ్రా తీసే ప్రదేశానికి చేరుకోవాలని అధికారులు తెలిపారు. 11గంటలకు కలెక్టర్ సి.నారాయణరెడ్డి మద్యం దుకాణాల కేటాయింపుకు సంబంధించి డ్రా తీయనున్నారు. జిల్లాలో గెజిట్ నెంబర్ల వారీగా ఒక్కో మద్యం దుకాణానికి వచ్చిన దరకాస్తుల సంఖ్య మేరకు కాయిన్స్ బాక్సులో వేసి దాంట్లో నుంచి డ్రా ద్వారా ఒక లక్కీ కాయిన్‌ను తీసి దరఖాస్తుదారుడి పేరు ప్రకటించనున్నారు. డ్రాలో ఎంపికైనవారికి రెండేళ్ల కాలానికి అంటే 2025 డిసెంబరు ఒకటి నుంచి 2027 నవంబరు 30 వరకు లైసెన్స్ అందజేస్తారు. ఒక్కో దరఖాస్తు కింద మూడు లక్షల రూపాయలు డీడీ/ చలాన్ రూపంలో జతపరిచి దాఖలు చేశారు. గతంలో దరఖాస్తు రుసుము రెండు లక్షల రూపాయలు ఉండగా, ఈ సారి ప్రభుత్వం మూడు లక్షలకు పెంచింది. కాగా టెండర్‌దారులు రిసిప్టుతోపాటు ఎక్సైజ్ అధికారులిచ్చిన ఎంట్రీ పాస్ ఉంటేనే లోనికి ప్రవేశం కల్పిస్తామని సరూర్‌నగర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఉజ్వలారెడ్డి తెలిపారు. అంతేగాక ఆధార్ గుర్తింపు కార్డు కూడా వెంట తీసుకుని రావాలని ఈమేరకు ఆమె తెలిపారు. కాగా, శంషాబాద్, సరూర్‌నగర్ యూనిట్లకు సంబంధించి రెండు వేర్వేరుగా హాళ్లు ఏర్పాటు చేశారు. బయటి వ్యక్తులకు ప్రవేశం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. కాగా, కొత్త మద్యం పాలసీ డిసెంబరు ఒకటో తేదీ నుంచి మొదలు కానుండగా అందుకు తగ్గట్టుగా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే, నాయకులు



ప్రభాకర్‌రెడ్డి-సునీత దంపతులతో కలిసి వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

తలకొండపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ తలకొండపల్లి మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి బావమరిది కోటిరెడ్డి వివాహ వేడుకల్లో ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు. హైదరాబాద్ తుర్కయాంజాల్ తులిప్స్ హోటల్‌లో జరిగిన వేడుకల్లో వారు పాల్గొని కోటిరెడ్డి-లావణ్య దంపతులను ఆశీర్వదించారు. వేడుకల్లో పాల్గొన్న వారిలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఏఎంసీ చైర్‌పర్సన్ గీతా నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ మిట్టపల్లి అంజయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఆమనగల్లు పట్టణాధ్యక్షుడు వస్పుల మానయ్య, మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ బంధువుల వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమాల్లో వస్పుల జంగయ్య, మండ్లీ రాములు, జగన్, జక్కు అనంత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతాం

ఆమనగల్లు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం టీడబ్ల్యూజేఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందని ఆమనగల్లు బ్లాక్ అధ్యక్షులు దరువుల శంకర్ అన్నారు. ఆదివారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలో శంకర్ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు అక్రిడేషన్, హెల్త్‌కార్డ్స్, ఇళ్ల ప్లాట్ల కొరకై టీడబ్ల్యూజేఎఫ్ పోరాటం సాగిస్తుందన్నారు. జిల్లా మహాసభల ఆహ్వాన కమిటీ అధ్యక్షులు యూనుస్, టీడబ్ల్యూజేఎఫ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి నరేశ్, జర్నలిస్టుల సంఘం నాయకులు నర్సింహ, తిరుపతి, యాదగిరి, శ్రీను, హఫీజ్, శేఖర్, ఇమ్రాన్, ఖలీల్, యాదగిరి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దరువుల శంకర్



ప్రమాద బీమా చేసుకున్న సభ్యులతో బూడిద రామ్‌రెడ్డి

ప్రమాద బీమాతో ధీమా

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత ప్రమాద బీమాతో ధీమాగా ఉండవచ్చని బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామ్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు ఫౌండేషన్ సభ్యులకు వ్యక్తిగత ప్రమాద బీమా కోసం ప్రీమియం చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం ఉప్పరిగూడలో 50మంది సభ్యులకు ప్రీమియం చెల్లించారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే ఒక్కొక్కరికి రూ.15 లక్షల బీమా సదుపాయం ఉంటుందని, క్షతగాత్రులకు చికిత్స అందించేందుకు ఈ పాలసీ ఎంతగానో ఉపయోగపడుతుందని రామ్‌రెడ్డి అన్నారు. ఈ మధ్య కాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువయ్యాయని, ఆసుపత్రుల్లో బిల్లులు చెల్లించలేక చాలామంది ఇబ్బందులుపడుతున్నారని అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రీమియం డబ్బులు చెల్లిస్తున్నట్లు రామ్‌రెడ్డి తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు



మరమ్మతు చేయిస్తున్న మహేశ్ యాదవ్

తలకొండపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎక్వాయిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ నాయకుడు జెనిగల మహేశ్ యాదవ్ ఆధ్వర్యంలో సొంత ఖర్చులతో ఆదివారం రోడ్డు మరమ్మతులు చేయించారు. ఎక్వాయిపల్లి-ముద్విన్ రోడ్డు పూర్తిగా పాడై రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్పందించిన మహేశ్ యాదవ్ సొంత నిధులు వెచ్చించి రోడ్డుపై గోతుల్లో మట్టి పోసి చదును చేయించారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి, నర్సింహ, సురేశ్, చంటి, గణేశ్, శేఖర్, వెంకటేశ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


ఆలయ నిర్మాణంలో భాగస్వాములవ్వాలి



విరాళం అందిస్తున్న మాజీ ఎంపీటీసీ చెన్నయ్య

షాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆలయ నిర్మాణంలో దాతలు భాగస్వాములు కావాలని ముద్దెంగూడ మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య కోరారు. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామంలో శివాలయం పునర్నిర్మాణం సందర్భంగా తన వంతుగా చెన్నయ్య రూ.5,00,100 విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఈసందర్భంగా కుమ్మరి చెన్నయ్య మాట్లాడుతూ.. దేవాలయం నిర్మాణం సందర్భంగా భక్తులు, ప్రజలు, దాతలు తమకు తోచిన విరాళం అందించి భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కూర వెంకటయ్య, మాజీ సర్పంచ్‌లు జయమ్మ, సుదర్శన్, మాజీ ఎంపీటీసీలు లక్ష్మి, నర్సింలు, నాయకులు పరిగి గణేశ్‌గౌడ్, లింగం, గోవర్ధన్‌రెడ్డి, నర్సింలు, వెంకటయ్య, గ్రామస్తులు ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



యాచారం, అక్టోబరు 26(ఆంధ్ర జ్యోతి): మండలంలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన శ్రీధర్ ఇటీవల బేగరి కంచ వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించాడు. దాంతో 2015-16 పదో తరగతి విద్యార్థులు స్నేహితుడైన శ్రీధర్ కుటుంబ సభ్యులకు ఆదివారం రూ.15వేల ఆర్థికసాయం అందించారు.

దండిగా నిధులు.. అభివృద్ధి పరుగులు

(ఐదో పేజీ తరువాయి)

నందిగామ, కొందుర్గు, కేశంపేట మండలాల్లో నూతన రహదారులు, సింగిల్ లేన్ బీటీ రూట్లను డబుల్ లేన్‌గా మార్చడం, పూర్తి అధ్వాన్నంగా మారిన రహదారులలో కొత్తగా నిర్మించడం, ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టనున్నారు. వీటి నిర్మాణాలకు గాను వెంటనే టెండర్లను పిలిచి పనులు చేపట్టనున్నారు.

నూతన కమ్యూనిటీ ఆస్పత్రికి రూ.5.3 కోట్లు

షాద్‌నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆస్పత్రికి నిధుల కొరత వెంటాడింది. దీంతో నిర్మాణం పూర్తయినప్పటికీ మౌలిక వసతులు లేకపోవడం వల్ల ప్రారంభానికి నోచుకోలేకపోయింది. మౌలిక వసతుల కోసం రూ.7.50 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో పాటు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ దృష్టికి తీసుకువెళ్లారు. నిధుల్లేక ఆస్పత్రి భవనం అసంపూర్తిగా మిగిలిందని మంత్రికి వివరించడంతో ఆయన రూ.5.3కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో వెంటనే ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించి వచ్చే నెలలో రోగులకు అందుబాటులోకి తేనున్నారు. ఈమేరకు నిధులు మంజూరు కావడంపై కమ్యూనిటీ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నిలిచిన రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు



కొందుర్గు కేజీబీవీ భవనం

కేజీబీవీలకు రూ.3.85 కోట్లు

షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో ఉన్న కేజీబీవీ పాఠశాలలకు రాష్ట్ర సర్కారు ఏకంగా రూ.3.85కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో అసెంబ్లీ పరిధిలోని ఫరూఖ్‌నగర్ మండలానికి రూ.1.10 కోట్లు, కేశంపేటలోని కేజీబీవీకి రూ.38లక్షలు, కొత్తూరులోని కేజీబీవీకి రూ.38 లక్షలు, కొందుర్గులోని కేజీబీవీకి రూ. 1.58 కోట్లు, చౌదరిగూడలోని కేజీబీవీకి రూ.42లక్షల నిధులు విడుదల చేసింది. వాటితో ఆయా పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ప్రహరీలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు.

ఆర్వోబీ నిర్వాసితులకు రూ.34 కోట్లు

షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం అర్ధంతరంగా నిలిచింది. ప్రస్తుతం చేపట్టిన నిర్మాణం వన్‌వే మాత్రమే ఉందని, వైజంక్షన్‌గా మార్చాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిర్ణయించారు. దీనికోసం అవసరమయ్యే స్థల సేకరణ ఇబ్బందిగా మారింది. బ్రిడ్జి చేపట్టిన ప్రాంతంలో అన్ని నివాస గృహాలు ఉండటం వల్ల పనులు ముందుకు సాగలేదు. అయితే బ్రిడ్జి నిర్మాణంలో ఇళ్లు కోల్పోయే వారికి నష్ట పరిహారం చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.34 కోట్లు మంజూరు చేసింది. త్వరలోనే నిర్వాసితులకు పరిహారం అందజేసి రూ.194 కోట్లతో వంతెన పనులు చేపట్టనున్నారు.

నిధుల మంజూరు హర్షణీయం



నియోజకవర్గంలో రహదారుల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరు చేయడం హర్షణీయం. ఏళ్ల తరబడి పలు గ్రామాలకు రహదారులు లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం చేకూరలేదు. ఎట్టకేలకు షాద్‌నగర్ పట్టణంలో ఆర్వోబీ నిర్మాణం, రహదారుల విస్తరణ, కొత్త రోడ్లు నిర్మించేందుకు చర్యలు చేపట్టిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

- కోడూరు రాములు, కేశంపేట మండలం

కేజీబీవీలకు పెద్దఎత్తున నిధులు ఇచ్చారు



పేద విద్యార్థులు చదువుకునే కేజీబీవీలకు నిధులు మంజూరు కావడం అభినందనీయం. పాఠశాలల్లో కనీస వసతులు లేక విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవచూపి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయిండం పట్ల విద్యార్థులు, తమ ఉపాధ్యాయులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- షకీరా నిస్సీ, కేజీబీవీ ప్రత్యేకాధికారి, కొందుర్గు